# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి శంకర్‌నాయక్

- ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్
- ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో సమావేశం

పరిగి, డిసెంబర్ 18 : విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ సూచించారు. బుధవారం పరిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటినుంచే ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అధ్యాపకుల మార్గదర్శనంలో చక్కగా చదువుకుంటే మంచి ఫలితాలు సాధ్యమన్నారు. కమిషనర్ ఇచ్చిన 90 రోజుల కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 90 రోజుల కార్యక్రమం అమలుపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్తిని కొనాలని రైతుల ఆందోళన



నాగసముందర్‌లో కాటన్ మిల్లు వద్ద రైతుల ఆందోళన

ధారూరు, డిసెంబర్ 18: రైతులు సీసీఐ కాటన్ కేంద్రాలకు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని శ్రీసాయి బాబా కాటన్ మిల్లు వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్ గ్రామ సమీపంలో ఉన్న శ్రీ సాయి బాబా కాటన్ మిల్లు వద్ద రైతులు పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన పత్తిని ఈ రోజే కొనుగోలు చేయాలని.. రేపు అయితే పత్తి ధర రూ.50 తగ్గుతుందని తెలిపారు. ఈ రోజు వచ్చిన వాహనాలను అనుమతించడం లేదని రైతులు సీసీఐ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

## దేవుడున్నాడు జాగ్రత్త పుస్తకావిష్కరణ

మొయినాబాద్, డిసెంబర్ 18 : ఎంవీఆర్ శాస్త్రీ రాసిన పుస్తకాన్ని చిలుకూరు బాలాజీ ఆలయ కమిటీ చైర్మన్, ఆలయాల పరిరక్షణ ఉద్యమ సంధానకర్త డాక్టర్ ఎంవీ సౌందరరాజన్‌కు బుధవారం ఆలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సౌందరరాజన్ మాట్లాడుతూ 'దేవుడున్నాడు జాగ్రత్త' అనే పుస్తకాన్ని ఎంవీఆర్ శాస్త్రీ అద్భుతంగా రాశారని చెప్పారు. ఆ పుస్తకాన్ని చదివితే దేవుడిపై భక్తితో ఎలా ఉండాలనే అంశాలపై అవగాహన వస్తుందన్నారు. ఆలయాలపై ప్రభుత్వాల జోక్యం, మితిమీరిన రాజకీయ ప్రమేయం లేకుంటే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, ప్రధాన అర్చకుడు రంగరాజన్ పాల్గొన్నారు.



చిలుకూరు బాలాజీ ఆలయంలో సౌందరరాజన్‌కు పుస్తకాన్ని అందజేస్తున్న ఎంవీఆర్ శాస్త్రీ దంపతులు

# పశు సంపదను కాపాడుకోవాలి



పంజాబ్ శాస్త్రవేత్తకు ఫెల్లోషిఫ్ అవార్డు అందజేస్తున్న మాజీ వీసీ హాఫీజ్ ,రిజిస్ట్రార్ శరత్‌చంద్ర

వ్యవసాయ యూనివర్సిటీ ,డిసెంబర్ 18 : దేశ వ్యాప్తంగా పశుసంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని శ్రీ వెంకటేశ్వర మాజీ ఉపకులపతి డా.హాఫీజ్ సూచించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై రెండో రోజు చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జంతువులు, ఫౌల్ట్రీ, జంతువుల నుంచి వ్యక్తులకు వ్యాపించే వ్యాధులపై ప్రభావం చూపే పరాన్న జీవుల నియంత్రణ, చికిత్సపై శాస్త్రీయ సదస్సు నిర్వహించారు. పరాన్న జీవుల ద్వారా జంతువులకు, వ్యక్తులకు వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి ఆధునిక పరిశోధనలపై చర్చ జరిగిందన్నారు. వివిధ విభాగాలలో అపూర్వ ప్రతిభ కనబర్చిన అధ్యాపకులు , విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాకల్టీ డీన్, సదస్సు ఆర్గనైజింగ్ కార్యదర్శి డా. ఉదయ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శరత్ చంద్ర , కళాశాల అసోసియేట్ డీన్ డా. మాధురి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వెటర్నరీ పార్సిటాలజీ అధ్యక్షులు డా శంకరణ్, కార్యదర్శి డా. అనిష్ యాదవ్, విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. హరికృష్ణ, విస్తరణ సంచాలకులు డా. కిషన్ కుమార్,దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఆశాఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు

# కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



కార్యకర్తలతో రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో కాంగ్రెస్, బీజేపీ, తదితర పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలకు పాలనపై అవగాహన లేక కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు గుర్తించారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. రాజేంద్రనగర్ సులేమాన్ నగర్‌లో నిరుపేద ముస్లిం సోదరులు ఉన్నారని , ఉమ్మడి పాలనలో ఏ పార్టీలు ఈ ప్రాంతాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని గుర్తు చేశారు. పదేండ్లలో ఇంటింటికీ నల్లా, షాదీముబారక్, రెండు పడకల గదులు, సీసీ రోడ్లు , డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. అనంతరం మహ్మద్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలను అభినందించారు. అలాగే నూతన డివిజన్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా మహ్మద్ జహీరుద్దీన్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ అమీర్, షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రెహమాన్, ఎండీ ఇబ్రహీం, ఎండీ మహబూబ్, ఎండీ మగ్బుల్, భాషతో పాటు 20 మందితో నూతన కమిటీని ప్రకటించారు.

### 27 నుంచి 46వ ఇండియన్ జాగ్రఫీ కాంగ్రెస్ సమావేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ మరో ప్రతిష్టాత్మక సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 27 నుంచి 46వ ఇండియన్ జాగ్రఫీ కాంగ్రెస్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జాగ్రఫర్స్ ఇండియా (ఎన్ఏజీఐ) సమావేశాలు జరుగనున్నాయి. ఎన్ఏజీఐ సహకారంతో ఓయూ జాగ్రఫీ విభాగం ఈ సమావేశాలు నిర్వహించనుంది. 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఫర్ సస్టెయినబుల్ ఎనర్జీ రిసోర్సెస్ అండ్ ఎస్డీజీస్: పాలసీ ఫ్రేమ్ వర్క్స్ అండ్ గ్లోబల్ ఇనీషియేటివ్స్'అనే అంశం పై నిర్వహించనున్న ఈ సమావేశాలకు కన్వీనర్‌గా జాగ్రఫీ విభాగం హెడ్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ లునావత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డాక్టర్ మహ్మ ద్ అక్తర్ అలీ వ్యవహరించనున్నారు. సమావేశాలను ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలోనిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### జలమండలిలో క్రిస్మస్ వేడుకలు

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): జలమండలిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జలమండలి వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో జీఎం ఏజే సుగంధిని, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్ , డైరెక్టర్ సుదర్శన్, జీఎంలు మాణిక్యం, వసంత, డీజీఎంలు నిరుపమ, సునీల్, అరుణ్‌కుమార్, పాస్టర్ రెవరెండ్ రమేశ్ పాల్గొన్నారు.

# లక్ష్మీగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులు - అధికారులు, స్థానికుల మధ్య వాగ్వాదం**



లక్ష్మీగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో అక్రమంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్‌లు, నిర్మాణాలను బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. లక్ష్మీగూడ నుంచి వాంబే కాలనీ వరకు ఉన్న ఆక్రమణలను సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ నేతృత్వంలో ఈ కూల్చివేతలు చేపట్టారు. పోలీసుల భారీ బందోబస్తు మధ్య జేసీబీల సహాయంతో కూల్చివేశారు. కనీసం తమ సామాను తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్థానికులకు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో స్థానికులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని పక్కకు తప్పించి కూల్చివేతలను యథావిధిగా చేపట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. సమయం ఇవ్వాలని అధికారులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కూల్చివేతలు చేపడుతున్నామని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.

**ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కూల్చివేస్తాం : సర్కిల్ ఉపకమిషనర్**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్, లక్ష్మీనగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ, కొంత మంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు, షెడ్‌లను ఏర్పాటు ఏర్పాటు చేశారన్నారు. దీంతో ఈ దారి గుండా ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే స్థానికుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ప్రజా అవసరాల నిమిత్తం కూల్చివేతలు చేపడుతున్నామని తెలిపారు. మరోసారి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఆవంత్స సోమసుందర్ ఆశయాలను కొనసాగించాలి

రవీంద్రభారతి,డిసెంబర్18: ఆవంత్స సోమసుందర్ ఆశయాల స్ఫూర్తిని కొనసాగించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఆవంత్స సోమసుందర్ శతజయంతి వేడుకలు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్ నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథిగా సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, డా.కోయి కోటేశ్వర రావు తదితరులు హాజరై సోమసుందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. ఆవంత్స సోమసుందర్ సమగ్ర సాహిత్యం గురించి చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలో ప్రకంపనలు సృష్టించిందని, ఆ ప్రభావంతో కవులు కావ్యాలు రాశారన్నారు. తెలంగాణలో దాశరథి ఒక్కడే పోరాడుతున్నాడని, ఆయనకు మద్దతుగా సోమసుందర్ వజ్రాయుధాన్ని అందించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లేరు వీరస్వామి, అరసం నాయకులు వేల్పుల నారాయణ, చందనాల సుమిత్ర, కొండపల్లి నిహారిణి, కెవి ఎల్ , చంద్రమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఎస్ఎస్ఏ ఉద్యోగుల వంటా వార్పు

- కలెక్టరేట్ ఎదుట నిరసన
- ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళన కొనసాగిస్తాం
- సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు



ఆదిబట్ల :భోజనాలు చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

ఆదిబట్ల, డిసెంబర్ 18 : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వంటావార్పు నిర్వహించి భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయడంతోపాటు తక్షణమే స్కేల్ అమలు చేసే వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి**

**ధారూరు :** జిల్లాలోని వివిధ మండలాల్లో సర్వ శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని పీఆర్‌టీయూ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మెకు మండల శాఖ తరపున వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల శాఖ తరపున రూ.11వేలు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీహెచ్ఎం రమేశ్ రూ.2వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతో పాటు ఉద్యోగ విరమణ తర్వాత వారికి ఆర్థిక భరోసా ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, జీహెచ్ఎం రమేశ్, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శివాని, గౌరవ అధ్యక్షుడు మల్లికార్జు న్ ఎస్ఎస్ఏ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఆర్థికసాయం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే పక్కాగా చేపట్టాలి

యాచారం, డిసెంబర్ 18 : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కాగా చేపట్టాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సంధ్యారాణి అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. మండల పరిధిలో కొనసాగుతున్న సర్వే తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు 30మంది సర్వేయర్లు 13,768 ఇందిరమ్మ ఇండ్లకు ఇప్పటివరకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అన్ని గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో సర్వేను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ శైలజ, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



యాచారంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సంధ్యారాణి

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ రాకేశ్

నందిగామ, డిసెంబర్ 18 : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ డీసీపీ రాకేశ్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడలో ఉన్న సింబయాసిస్ యూనివర్సిటీలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అనవసరంగా ఫేక్ యాప్స్, అప్లికేషన్లు తదితర వాటిని డౌన్‌లోడ్ చేసుకోరాదని సూచించారు. ఓటీపీ నంబర్లు ఇతరులకు చెప్పరాదన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురయితే వెంటనే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్, నందిగామ సీఐ ప్రసాద్, ఎస్సై గోపాల కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరాలు తగ్గాయి



ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఎస్సై

బషీరాబాద్, డిసెంబర్ 18 : తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైం రేట్ తగ్గిందని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్క హత్య కేసు నమోదు కాకపోవడం గమనార్హమని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డితో కలిసి బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఎస్సై శంకర్ ఎస్పీ, డీఎస్పీలకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అంతకు ముందు ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఠాణా ఆవరణలో పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల్లో మార్పు వచ్చిందన్నారు. పోలీసులు శాతియుత వాతావరణం నెలకోల్పేందుకు కృషి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. గతేడాది కంటే ఈ సంవత్సరం క్రైం రేట్ తగ్గిందన్నారు. అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్యలు, అదృశ్యమైన కేసులు తగ్గపోయాయన్నారు. కార్యక్రమంలో తాండూరు రూరల్ సీఐ నగేశ్, ఎస్సై శంకర్, ఏఎస్సై నారాయణ, సిబ్బంది ఉన్నారు.

# 22న సారంగి ఫిల్మ్ అవార్డులు ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలుగు సినిమాల్లో ప్రతిభ చాటుతున్న నటీనటులను ప్రోత్సహించడం అభినందనీయమని ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. ఈ నెల 22న రవీంద్రభారతిలో సాయంత్రం 6గంటలకు జరగనున్న సారంగి ఫిల్మ్ అవార్డుల కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం రాఘవేంద్రరావు కార్యాలయంలో ఆవిష్కరించారు. సినిమా రంగానికి చెందిన పలు కేటగిరీల్లో అవార్డులను అందజేస్తున్నట్లు సారంగి అధినేత ఖాజా అఫ్రిది తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు, సినీ దర్శకుడు వేణు ఉడుగుల తదితర ప్రముఖులు పాల్గొంటారని వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పల్లె సుమన్, సిల్వేస్టర్, శ్రీకాంత్, సన్నీ పాల్గొన్నారు.



సారంగి ఫిల్మ్ అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకుడు రాఘవేంద్రరావు

# డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ రెడీ

- ఎల్బీ నగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఐఆర్ఆర్‌పై నాలుగు కొత్త ఫ్లై ఓవర్లు
- హెచ్ సిటీలో రూ.955 కోట్లతో పనులు
- ప్రత్యేక ఆకర్షణగా ఒకే మార్గంలో ఫ్లై ఓవర్, మెట్రో మార్గం
- త్వరలోనే పనులకు టెండర్లు..

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ) : ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న ఇన్నర్ రింగు రోడ్డుపై కొత్తగా నాలుగు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సన్నద్ధమవుతున్నది. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా ఎల్బీనగర్-ఆరాంఘర్ ప్రాంతాల మధ్య ఐఆర్ఆర్ (ఇన్నర్ రింగు రోడ్డు)పై ఆరు లేన్ల వెడల్పుతో దాదాపు రూ.955 కోట్ల వ్యయంతో మరో నాలుగు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తొలిసారిగా డబుల్ డెక్కర్ విధానంలో నిర్మాణం చేయనుంది. కింద ఫ్లై ఓవర్, పైన మెట్రో మార్గం ఉండనుంది. ఈ మేరకు నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ చౌరస్తా, శంషాబాద్ మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయం వెళ్లే 36.8 కిలోమీటర్ల పొడవైన మెట్రో రైల్ మార్గంతో ఆయా ఫ్లై ఓవర్లను అనుసంధానం చేయనున్నారు. నాలుగు ఫ్లై ఓవర్లను టీకేఆర్ కాలేజీ కూడలి, గాయత్రి నగర్, మందమల్లమ్మ జంక్షన్లు మీదుగా ఒకటి, ఒమర్ హోటల్ నుంచి సోయబ్ హోటల్ వరకు వయా మెట్రో ఫంక్షన్ హాల్ మీదుగా మరొకటి, బండ్లగూడ-ఎర్రకుంట క్రాస్‌రోడ్ జంక్షన్ మీదుగా మూడో ఫ్లై ఓవర్, మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ జంక్షన్ల మీదుగా నాలుగో ఫ్లై ఓవర్ నిర్మాణం జరగనుంది. కాగా ఎస్ఆర్‌డీపీలో భాగంగా ఇప్పటికే జీహెచ్‌ఎంసీ ఇప్పటికే చాంద్రాయణగుట్ట, ఒవైసీ చౌరస్తా , బైరామల్‌గూడ, ఎల్బీనగర్ కూడళ్లలో ఫ్లై ఓవర్లను నిర్మించగా, తాజాగా హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నాలుగు ఫ్లై ఓవర్ల పనులను తెరమీదకు తీసుకువచ్చింది.